www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 ఏప్రిల్ 2024
5
పశ్చిమ గోదావరి

'మిచౌంగ్' పరిహారం రూ.26.22 కోట్లు వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మిచౌంగ్ తుపాను వల్ల పంట కోల్పోయిన కౌలురైతులు, రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన పంటనష్టం ఇంతవరకు జిల్లాలో ఏఒక్క కౌలురైతుకీ ఒక్క రూపాయి కూడా పడలేదని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వా సీజన్‌లో సంభవించిన మిచౌంగ్ తుపానుకు జిల్లాలోని 20 మండలాల్లో 15,564 హెక్టార్లలో పంట దెబ్బతిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం 31,673 మంది రైతులు, కౌలురైతులకు రూ.26.22 కోట్ల పంటనష్టం విడుదల చేసినట్లు గత నెలలో ప్రకటించిందని తెలిపారు. అయితే ఇప్పటి వరకూ ఒక్క రైతుకీ పంట నష్టపరిహారం జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, సొమ్ము రైతుల ఖాతాల్లో జమైందని అంటున్నారని, ఆర్‌బికె అధికారులు ఒక్కరికీ పడలేదని తెలిపారు. తక్షణం రైతులకు పంటనష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

సమస్యల ఊసే కరువు
ఉచితాలే ఏకరువు..!

- ప్రజా సమస్యలపై మాట్లాడని వైసిపి, టిడిపికూటమి అభ్యర్థులు
- రెండు జిల్లాల్లో తాగునీరు, రోడ్లు, నిర్వాసితుల సమస్యలెన్నో తిష్ట
- ఇచ్చిన, ఇవ్వబోయే సంక్షేమ పథకాల చుట్టే ప్రచారమంతా
- ఓట్లు కొనుగోలుపైనే నాయకుల దృష్టంతా

విలీన మండలాల్లో గోదావరి వరద (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ప్రజా సమస్యలపై కాకుండా.. ఇస్తున్న, ఇవ్వబోయే ఉచిత పథకాల చుట్టూనే సాగిస్తున్నారు. తాను గెలిస్తే నియోజకవర్గంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన ప్రజా సమస్యలను పరిష్కారిస్తానంటూ అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏఒక్కరూ ప్రచారంలో మాట్లాడటం లేదు. ప్రజా సమస్యలను మరుగున పెట్టేందుకు ఇతర రాజకీయ అంశాలను తెరపైకి తెస్తున్న పరిస్థితి ఉంది. పోలింగ్‌కు ముందురోజు ఓట్లు కొనుగోలుపైనే నాయకులంతా దృష్టి సారించి ముందుకు సాగుతున్నట్లు కన్పిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం అలానే ఉన్నాయి. వీటిలో తాగునీరు ప్రధానమైంది. దాదాపు 39 లక్షల మంది ప్రజానీకం సమస్య ఇది. పదేళ్లుగా తాగునీటి సమస్యకు పాలకులు పరిష్కారం చూపలేకపోయారు. ఆక్వా చెరువులతో తాగునీటి వనరులన్నీ కలుషితమై సొమ్ము చెల్లించి కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి సంబంధించిన సమస్యను ఏవిధంగా పరిష్కరిస్తారు, ఎప్పటికి పరిష్కరిస్తారు..అనేది ఏఒక్క నాయకుడు మాట్లాడటం లేదు. గడిచిన పదేళ్లుగా జనం ఎదుర్కొంటున్న మరో సమస్య అధ్వాన రోడ్లు. రెండు జిల్లాల్లో మూడు వేలకుపైగా కిలోమీటర్ల మేర ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. జనాలు ప్రయాణించలేని స్థితికి చేరాయి. గత టిడిపి ప్రభుత్వంలోగాని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలోగాని రోడ్లు గురించి పట్టించుకున్న నాధుడే లేకుండాపోయాడు. నిన్నటి వరకూ రోడ్లు గురించి తెగ ఉపన్యాసాలు దంచేసిన ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో నోరువిప్పడం లేదు. నియోజవర్గాల్లో దెబ్బతిన్న రోడ్లు పరిస్థితిపై ఎన్నికల ప్రచారంలో మాట్లాడటం లేదు. నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్, వశిష్ట గోదావరిపై వంతెన నిర్మాణం వంటి సమస్యల గురించి ఎన్నికల బరిలో ఉన్న నాయకుల మాటల్లో ప్రస్తావనకు రావడం లేదు. పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ నిర్మిస్తామని చెప్పారు. పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో మెడికల్ కాలేజీ నిర్మాణానికి భూమి కొనుగోలు చేసినట్లు చెప్పినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. తాము అధికారంలోకి వస్తే మెడికల్ కాలేజీ నిర్మిస్తామంటూ ఏఒక్కరూ మాట్లాడటం లేదు. కొల్లేరు ప్రజల సమస్య గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. మూడో కాంటూరు కుదింపు సంగతిని పక్కన పెట్టేసి, ఎకోసెన్సిటివ్ జోన్‌ను తెరపైకి తెచ్చారు. దీంతో కొల్లేరు ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కొల్లేరు ప్రజల సమస్యను ఏవిధంగా తీరుస్తారో రాజకీయ పార్టీల నాయకులు నోరువిప్పి మాట్లాడని పరిస్థితి ఉంది.

బాధితుల సమస్యలపైనా మౌనమే

పోలవరం నిర్వాసితుల సమస్యపై టిడిపి కూటమి, వైసిపికి చెందిన నాయకులు అసలు మాట్లాడటం లేదు. పునరావాస ప్యాకేజీ, భూములకు, యువతకు ఇస్తానన్న పరిహారం ఇలా ఎన్నో సమస్యలతో నిర్వాసితులు నలిగిపోతున్నారు. తమను గెలిపిస్తే నిర్వాసితుల సమస్యలను ఎప్పటికి పరిష్కరిస్తారో నాయకులు చెప్పాల్సి ఉంది. దాదాపు 20 వేల కుటుంబాలకు సంబంధించిన సమస్య రాజకీయ నాయకులకు పట్టడం లేదు. చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు పరిహారం సమస్య పదేళ్లుగా సాగుతోంది. ఇప్పటికైనా సమస్యను పరిష్కరిస్తారో, లేదో అర్థం కాని పరిస్థితి ఉంది. ఏలూరులో జ్యూట్‌మిల్లు మూతపడటంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. కార్మికుల ఉపాధికి ఏం చేస్తారో నాయకులు చెప్పాల్సి ఉంది.

ఉచితాలపైనే ఫోకస్.. ఓట్ల కొనుగోలుకు ప్రణాళికలు

రాజకీయ పార్టీల అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారంలో ఉచిత పథకాలపైనే పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులైతే ఇస్తున్న పథకాలపైన, ప్రతిపక్ష నేతలైతే ఇవ్వబోయే పథకాలపైనే ఫోకస్ పెడుతూ ముందుకు సాగుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించడం లేదు. ఇప్పటికే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రకరకాల గిఫ్టులు ఇస్తున్న అభ్యర్థులు.. పోలింగ్ ముందురోజు ఓట్ల కొనుగోలుపైనే ప్రధానంగా దృష్టి సారించిన పరిస్థితి ఉంది. ఓటుకు ఎంత పంపిణీ చేయాలి. ఏవిధంగా చేయాలి. ఎంతమందిని నియమించుకోవాలి వంటి డబ్బు పంపకాల ప్రణాళికలు రూపొందించే పనిలో తలమునకలయ్యారు.

86 శాతం పింఛన్ల పంపిణీ

రూ.1,19 కోట్లు సొమ్ము రాక నిలిచిన పంపిణీ - రెండోరోజు లబ్ధిదారులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి నెలా ఒకటో తేదీన అందే పెన్షన్ సొమ్ము నాలుగు రోజులైనా అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పెన్షన్ సొమ్ము కోసం ఆశగా సచివాలయాలకు వెళ్లిన పింఛనుదారుల్లో కొందరికి గురువారం చేదు అనుభవం ఎదురైంది. పెన్షన్ ఇచ్చేందుకు డబ్బు లేదని అధికారులు చెప్పడంతో ఉసూరుమంటూ వెనుదిరిగిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో సుమారు 2 లక్షల 34 వేల 884 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రతినెలా జిల్లావ్యాప్తంగా రూ.68.92 కోట్లు లబ్ధిదారులకు పెన్షన్ రూపంలో అందిస్తున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.కోటీ 19 లక్షలు బ్యాంకులకు జమ కాల్సి ఉంది. దీంతో జిల్లాలో పంపిణీ 86.65 శాతమే పూర్తయ్యింది. పెన్షన్‌దారులు మాత్రం ఉదయమే సచివాలయాల వద్దకు చేరుకున్నారు. అయితే సొమ్ము లేదని చెప్పడంతో వారంతా నిరాశగా వెనుదిరిగారు.

ఆశలన్నీ ఆవిరి..!

లారీ ఢీకొని దంపతులు దుర్మరణం

కన్నీరుమున్నీరైన కుమారుడు, కుమార్తె

ప్రజాశక్తి - పెనుగొండ

బంధువుల ఇంట వివాహానికి వెళ్లారు. ఆనందంగా గడిపి త్వరలోనే తమ ఇంట కూడా పెళ్లి భాజాలు మోగించాలనే ఆలోచనలతో ఇంటికి వెనుదిరిగారు. అయితే వారి ఆశలు, ఆలోచనలు సాకారం కాకుండానే లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కబళించింది. దీంతో పెనుగొండలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇసురు మాధవరెడ్డి, కృష్ణవేణి (ఫైల్‌ఫొటో)

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన ఇసురు మాధవరెడ్డి (50), కృష్ణవేణి (39) దంపతులు 15 ఏళ్ల క్రితం వ్యాపారం రీత్యా పెనుగొండ వచ్చి స్థిరపడ్డారు. మాధవరెడ్డి పాత ప్లాస్టిక్ సామగ్రితో పైపులు తయారు చేసే చిన్నపాటి పరిశ్రమ నడుపుతున్నాడు. వీరి కుమారుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి తండ్రికి సహాయకారిగా ఉంటుండగా కుమార్తె ఇంజినీరింగ్ చదువుతోంది. పెనుగొండలో అందరికీ సన్నిహితంగా ఉండే మాధవరెడ్డి ఇటీవలే కొత్త ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు సమాచారం. ఇంటి నిర్మాణం పూర్తవ్వగానే కుమార్తె, కుమారులకు వివాహాలు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఈ దంపతులు బుధవారం రాత్రి పాలకొల్లులో జరిగిన ఒక వివాహానికి హాజరయ్యారు. అనంతరం మోటారు సైకిల్‌పై పెనుగొండ బయల్దేరారు. వీరు పోడూరు మండలం జగన్నాధపురం వచ్చేసరికి వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణవేణి అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాల పాలైన మాధవరెడ్డి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. దీంతో పెనుగొండలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం తరలించారు. పోడూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జిల్లాలో చంద్రబాబు పర్యటన సాగేదిలా

నరసాపురం, పాలకొల్లులో ప్రజాగళం సభలు

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల ఐదో తేదీ శుక్రవారం నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మండలంలోని సీతారామపురం గ్రామంలో స్వర్ణాంధ్ర కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం రెండున్నర గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 2.45 నిమిషాలకు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంటారు. అనంతరం స్టీమర్ రోడ్డులోని కనకదుర్గ ఆర్చి వద్ద మూడు గంటలకు జరిగే ప్రజాగళం బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం 4.45 నిమిషాలకు పాలకొల్లు చేరుకుంటారు. రాత్రికి పాలకొల్లులో బస చేస్తారు. ఇప్పటికే ఏర్పాట్లను నాయకులు పూర్తి చేశారు. హెలీప్యాడ్ పనులను టిడిపి జిల్లా అధ్యకురాలు తోట సీతారామలక్ష్మి, నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పరిశీలించారు.

పనులను పరిశీలిస్తున్న తోట సీతారామలక్ష్మి

ప్రజాగళం సభలను విజయవంతం చేయాలి

నరసాపురం, పాలకొల్లులో ప్రజాగళం సభలను విజయవంతం చేయాలని టిడిపి జోన్-2 ఇన్‌ఛార్జి మందలపు రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, నరసాపురం బిజెపి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. జనసేన అసెంబ్లీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

పాలకొల్లు: పాలకొల్లులో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ప్రజాగళం సభలో టిడిపి అధినేత చంద్రబాబు ప్రసంగిస్తారని, ఈ సభకు అంతా విచ్చేసి జయప్రదం చేయాలని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ఆయన గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాంధీబొమ్మల సెంటర్లో సభ జరుగుతుందని, ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లోని హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకు రోడ్ షో జరుగుతుందన్నారు. సమావేశంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జనసేన నాయకులు బోనం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గణపవరం: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని సిహెచ్.అగ్రహారంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి జి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ మండలంలో ధాన్యం పట్టుబడికి రైతు భరోసా కేంద్రంలో ఇచ్చిన సంచులు వినియోగించగా మిగిలిన సంచులు ఆర్‌బికెలో అప్పగించాలని రైతులను కోరారు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శివరాం మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. ఒకవేళ రైతులు ధాన్యాన్ని మద్దతు ధర కంటే ఎక్కువ ధర బయట వస్తే ధాన్యాన్ని బయటకు అమ్ముకోవచ్చునని చెప్పారు. అదే సమయంలో మద్దతు ధర కంటే తక్కువ ధరకు మాత్రం అమ్ముకోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ సరోజిని, తహశీల్దార్ వై.రాంబాబు, తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, వ్యవసాయ శాఖాధికారి వైవిఎస్.ప్రసాద్ ఎంఎల్ఒ దేవదాసు, రైతులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో రైతుల సహకారం అవసరమని జిల్లా సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శివరామ్ కోరారు. మండలంలోని పట్టెంపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరామ్ మాట్లాడుతూ జిల్లాలో 7.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అనంతరం ధాన్యం లోడు ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఒ నాగరాజు, సహకార సంఘం సబ్ డివిజన్ అధికారి నరేంద్రకుమార్, ఆర్‌డిఒ కె.చెన్నయ్య, వ్యవసాయ డివిజన్ అధికారి పి.మురళీకృష్ణ, తహశీల్దార్ మురళీకృష్ణ, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్లు కీలకం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థుల్లో వినూత్న ఆలోచనా శక్తి రేకెత్తించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ టెక్నికల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన హార్డువేర్ లైవ్ మోడల్స్‌ను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు నిరంతరం నూతన అన్వేషణలపై దృష్టి సారిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ పి.రామ్మూర్తిరాజు, ఎం.అనిల్ మాట్లాడుతూ చినఅమిరం, భీమవరం ఝాన్సీ లక్ష్మీబాయి ఉన్నత పాఠశాల, విజ్ఞాన భారతి పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కొన్ని సంవత్సరాలుగా తమ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞ ఎగ్జిబిషన్ పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.బ్రహ్మరాజు, డాక్టర్ వికె.విశ్వనాధరాజు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ సైకిల్‌తో విద్యార్థినులు

రోడ్‌షోలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఆచంట ఆర్ఒ వి.స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

రోడ్‌షో నిర్వహించే అభ్యర్థులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్వామినాయుడు మాట్లాడుతూ రోడ్ షోలు సెలవు రోజుల్లో మాత్రమే నిర్వహించాలన్నారు. పెద్ద హాస్పిటల్స్, బ్లడ్ బ్యాంక్స్, ఎక్కువ రద్దీ ఉండే మార్కెట్ల దగ్గర నిర్వహించకూడదన్నారు. రోడ్‌షోలో ఎన్ని వెహికల్స్, ఎంతమంది ర్యాలీలో పాల్గొంటున్నారు వెహికల్ నెంబర్లతో సహా తెలియపరచాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. 85 ఏళ్ల పైబడి నడవలేని స్థితిలో ఉన్నవారికి, వికలాంగులకు హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వి.ప్రసాద్‌రెడ్డి, తలుపూరి బుల్లబ్బాయి, కర్రి వెంకటనారాయణరెడ్డి, గణపతినీడి రామ్మోహన్, ఎం.కృష్ణకాంత్, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామినాయుడు

కలెక్టరేట్లో మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ప్రారంభించారు. మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గాల మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా అందిన ఫిర్యాదులను కలెక్టర్ వివరించారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా, దానిపై విచారణ చేయించి చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ మార్గాల్లో వచ్చిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.54.06 లక్షలు నగదు, రూ.8.28 లక్షలు విలువైన మద్యం, వివిధ రకాల వస్తువులను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి టి.నాగేశ్వరరావు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, ఎన్నికల డిటి సన్యాసిరావు, ఇతర అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు పాల్గొన్నారు.

రూరల్ బ్యాంక్ సిఇఒగా తోట

ప్రజాశక్తి - ఆకివీడు

'ది ఆకివీడు విశాల సహకార పరపతి సంఘం' (రూరల్‌బ్యాంక్) ముఖ్య కార్యనిర్వహణాధికారిగా తోట శ్రీనివాసరావు (బాబి) నియమితులయ్యారు. గత సంవత్సర కాలంగా ఆస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న తోట సతీష్ మార్చి 31న రిటైరయ్యారు. దీంతో ఆ స్థానంలో శ్రీనివాసరావు నియమితులయ్యారు. బాబీని బ్యాంక్ అధ్యక్షులు కేసిరెడ్డి మురళీ, సభ్యులు, బ్యాంక్ సిబ్బంది అభినందించారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

ఎపి వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పట్టెంపాలెం గ్రామంలో పర్యటించి ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ గత సంవత్సరం బకాయిలు ఇప్పటికీ తమకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలి రూ.600కు పెంచి 200 రోజులు పనులు చూపించాలని కోరారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అయనమిల్లి వెంకటరావు, ఝాన్సీరాణి, వీరమల్ల వెంకటరత్నం, కూనపో భాస్కరరావు, జాలపర్తి సుబ్బమ్మ, ఆరుగొల్లు రామలక్ష్మి, మేక వేణు పాల్గొన్నారు.

నినదిస్తున్న ఉపాధి కూలీలు

ఉండి టిడిపి అభ్యర్థిని నేనే

సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో ఉండి టిడిపి అభ్యర్థిగా కూటమి తనకు అవకాశం ఇచ్చిందని, తానే పోటీలో ఉంటానని ఉండి ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి మంతెన రామరాజు స్పష్టం చేశారు. అభ్యర్థిని మార్చుతారంటూ సాగుతున్న ప్రచారాన్ని పట్టించుకోకుండా కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. గురువారం భీమవరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే డోర్ టు డోర్ ప్రచారంలో భాగంగా తాను 1400 కిలోమీటర్లు తిరిగానన్నారు. తన సతీమణి 100 కిలోమీటర్లు పూర్తి చేశారని, దీంతో 1500 కిలోమీటర్లు పూర్తయ్యిందన్నారు. మాజీ ఎంఎల్ఎ శివరామరాజుకు టిడిపి అధిష్టానం మూడుసార్లు అవకాశం ఇచ్చిందన్నారు. రెండుసార్లు ఎంఎల్ఎగా గెలిచిన ఆయన మూడోసారి తానే ఎంపీగా పోటీ చేస్తానని కోరడంతో ఎంపీ టిక్కెట్ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, బిజెపి నాయకులు రామ్మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

16 నుంచి సమ్మేటివ్ పరీక్షలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని 48 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ నెల ఆరో తేదీ నుంచి 19 వరకు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, ఒ.నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సీల్ చేసిన ప్రశ్నాపత్రాలను, ఒఎంఆర్ పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. మండల పరిధిలో 35 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలతో పాటు, 14 ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయని వారు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మృతి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దొమ్మేటిచిట్టి వేణుగోపాలశ్రీనివాస్(55) పెనుగొండలో తన నివాసంలో గురువారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ప్రస్తుతం మెడికల్ సెలవులో ఉన్నారని పోలీస్ సిబ్బంది తెలిపారు. శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలున్నారని, పెద్ద కుమార్తె డాక్టర్ చదువు పూర్తి చేసిందని, రెండో కుమార్తె ఎంఎస్‌సి చదువుకుందని తెలిపారు. శ్రీనివాస్ స్వగ్రామం పెనుమంట్ర మండలం సత్యవరం గ్రామంలో దహన సంస్కారాలు చేస్తామని బంధువులు తెలిపారు. పెనుగొండ పోలీస్ స్టేషన్ సిఐ రజిని కుమార్, ఎస్ఐ షేక్ సుభాని, పోలీస్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ కాలనీలో 'మన ఊరికి మన వాసన్న'

ప్రజాశక్తి - గణపవరం

వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో గురువారం నిర్వహించిన మన ఊరికి మన వాసన్న కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేవే గెలిపించాలని కోరారు. ఇందిరమ్మ కాలనీలో ఉన్న టిడిపి, జనసేన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. పుప్పాల శ్రీనివాసరావు సమక్షంలో వైసిపిలో చేరిన వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గణపవరం అధ్యక్షులు రొంగల శ్రీనివాసరావు, మండల కన్వీనర్ దండు రాము, గణపవరం గ్రామం సర్పంచి మోర అలంకారం పాల్గొన్నారు.

ఎల్‌బి.చర్లలో ముదునూరి ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గస్థాయిలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి తనను మరొకసారి గెలిపించాలని చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ఎల్‌బి.చర్ల గ్రామంలో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ పల్లెనిద్ర చేశారు. గురువారం మార్నింగ్ వాక్‌లో భాగంగా పలు కూడలిలో స్థానికులతో ప్రసాదరాజు మాట్లాడారు. సంక్షేమ పథకాలు నేరుగా రావాలంటే సిఎంగా జగన్ మళ్లీ గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో దొంగ మురళీకృష్ణ, గుబ్బల భాను, యమునా, కటకంశెట్టి రామకృష్ణ, బొడ్డు ఆశిష్‌కుమార్, సంగాని లక్ష్మణరావు పాల్గొన్నారు.



మొగల్లులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పివిఎల్

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని మొగల్లు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించి మాట్లాడారు. గతంలో పోటీ చేసి ఓటమి చెందానని, ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించి గెలుపునకు సహకరించాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎంతో అభివృద్ధి చేశానని, గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), యూత్ విభాగం అధ్యక్షులు పెనుమత్స వెంకటరాజు, పార్టీ మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, వైసిపి సీనియర్ నాయకులు పెన్మెత్స సీతారామాంజనేయురాజు, జాలే సునీత, దొడ్డ విశ్వేశ్వరరావు, గుత్తుల ప్రసాద్, మద్దుల మౌళి, పంపన శ్రీను, చేబోలు నాగేశ్వరరావు, ఆకుల బుజ్జి, సత్యనారాయణ, వెంకన్న, బాపిరాజు, కడిమి కుమార్, చిట్టిబాబు, బ్రహ్మాజీ, శివ, గొల్లయ్య, వంశీకృష్ణంరాజు, గోపాలకృష్ణమరాజు, నాగేశ్వరరావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

'వాలంటీర్ వ్యవస్థకు టిడిపి వ్యతిరేకం కాదు'

ప్రజాశక్తి - నరసాపురం

వాలంటీర్లకు రానున్న టిడిపి కూటమి ప్రభుత్వంలో న్యాయం చేస్తామని, వాలంటీర్ వ్యవస్థకు తెలుగుదేశం పార్టీ వ్యతిరేకం కాదని, రాజకీయాలు చేసే వాలంటీర్లకు మాత్రమే టిడిపి వ్యతిరేకమని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు మహిళా నేత డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. వాలంటీర్లను రెచ్చగొట్టి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. పేదలు, వృద్ధులు, వికలాంగుల పింఛన్లతో జగన్ కొత్త డ్రామా ఆడుతున్నారన్నారు. పింఛన్ల పంపిణీ వ్యవహారంలో వైసిపి ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తుందన్నారు.

పలు గ్రామాల్లో శ్రీరంగనాధరాజు పర్యటన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల కేంద్రం పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు గ్రామాల్లో వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు గురువారం పర్యటించారు. రెండు గ్రామాల్లోని అన్ని వీధుల్లో తిరుగుతూ, ఓటర్లను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మండల, స్థానిక పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని యర్రం శెట్టివారిపాలెం గ్రామానికి చెందిన జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. వారికి చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దొంగ మురళీకృష్ణ, బొక్కా రాధాకృష్ణ, ఉంగరాల రమేష్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పని చేస్తున్నారని విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాడేరులో గురువారం రాత్రి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదేళ్ల పరిపాలనలో సిఎం జగన్ అభివృద్ధిని, సంక్షేమాన్ని రెండు కళ్లతో అమలు చేశారన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర యూత్ సెక్రటరీ నామన మహేష్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మండల జెసిఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, బండి శక్తీశ్వర సాంబమూర్తి, శిరిగినీడి ప్రసాద్, గూడపాటి పెద్దిరాజు, మల్లిపూడి సూర్యారావు, సంబలదీవి వినాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

21 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి గ్రామ సచివాలయం వద్ద గురువారం 21 మంది రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా లేఖలను గ్రామ కార్యదర్శికి అందించారు.

కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి బుజ్జికి న్యాయవాదుల సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

తన గెలుపునకు సహకరించాలని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర్‌కృష్ణప్రసాద్(బుజ్జి) కోరారు. పట్టణంలో న్యాయవాదులను ఆయన గురువారం కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. తోటి న్యాయవాదికి ఎంఎల్ఎ సీటు రావడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సన్మానించారు.

మజ్జిగ వితరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

పలు గ్రామాలకు కూడలి అయిన మార్టేరు సెంటర్‌లో దాహార్తులకు మజ్జిగ వితరణ జరుగుతుంది. మండలంలోని నెగ్గిపూడి, వెలగలేరు, మార్టేరు, సత్యవరం, వనంపల్లి పంచగ్రామాల రెడ్డి సేవా సంఘం తరపున వేసవి కాలం ప్రారంభం నుంచి చలివేంద్రం ఏర్పాటు చేస్తారు. రోజుకు 25 లీటర్ల గడ్డపెరుగు, 25 లీటర్ల కూలింగ్ మంచినీళ్లను ఇందుకు వినియోగిస్తున్నామని ఆ సంఘం అధ్యక్షుడు కెకెఆర్.చంద్రశేఖరరెడ్డి (ఆచారి) తెలిపారు.

పలు గ్రామల్లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రతి గడపలో తమకు పడే ఓట్లు ఉన్నాయని, అన్ని ఇళ్లు తిరుగుతానని వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు సోదరుడు పి.గోపాలకృష్ణంరాజు అన్నారు. తన అన్న తరపున గోపాలకృష్ణంరాజు మండలంలోని సిద్ధాపురం, చిన్నమిల్లిపాడు, రాజుపేట గ్రామాల్లో గురువారం పర్యటించారు. వైసిపికి ఓటు వేసి తన అన్నను గెలిపించి, జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి పాల్గొన్నారు.

వివేకానంద పాఠశాలలో వంటల ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యా సంవత్సరం తుది పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల్లో ఒత్తిడి పోగొట్టడానికి సంప్రదాయ పిండి వంటల ప్రదర్శన దోహదం చేస్తుందని మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ చకర్ అన్నారు. స్థానిక వివేకానంద విద్యా సంస్థ ప్రాంగణంలో ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన తీపి, కారం సంప్రదాయ పిండివంటలను పలువురు సందర్శకులు రుచి చూసి నిర్వాహకులు జి.రామారెడ్డి, కె.శ్రీనివాసరెడ్డిలను, విద్యార్థులను అభినందించారు.

250 ఆటోలకు ఎన్నికల నియమావళి స్టిక్కర్లు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్నికల్లో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ఓట్లు వేయాలని చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షులు పంపన గోపీ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు విలువ ప్రాముఖ్యత, ఎన్నికల నియమావళి స్టిక్కర్లను పట్టణంలోని 250 ఆటోలకు స్టిక్కరింగ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఈ స్టిక్కర్ల కార్యక్రమంలో భాగస్వాములై ప్రయాణికులకు ఓటు విలువ తెలియజేస్తామన్నారు. యూనియన్ నాయకులు సోమేశ్వరరావు, శ్రీనివాస్, రాము, సత్తిబాబు మాట్లాడుతూ ఓటు విలువపై ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని మూడు సెంటర్లలోని 250 ఆటోలకు ఎన్నికల నియమావళి స్టిక్కర్లును అంటించినట్లు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం జనసేన పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులో గురువారం నిర్వహించిన మనకోసం మన నాయకర్ కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో వివరించారు. రానున్న ఎన్నికల్లో నరసాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపీకృష్ణ, వలవల నాని, వాతాడి కనకరాజు, గుబ్బల మార్రాజు, బొక్కా చంటి, కూనపరెడ్డి రామకృష్ణ, లక్కు బాబి, బొల్లా చంటి, పాలా రాంబాబు, నిప్పులేటి తారకరామారావు, పులపర్తి రమేష్, దాసరి బాబి, అందే దొరబాబు పాల్గొన్నారు

మొగల్తూరులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని దత్త సాయి మందిరంలో గురువారం భారీ అన్న సంబరాధన చేశారు. యాత్రికులు బాబావారిని దర్శించుకున్నారు. అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. మొగల్తూరు గ్రామానికి చెందిన గుడిమెట్ల శివప్రసాద్, సుజాత దంపతులు దత్త సాయికి వెండి కిరీటాన్ని చేయించి ఆలయ నిర్వాహకులు శెట్టి మోహనరావుకు అందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల నిబంధనలకు లోబడి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ముద్రించాలని, నిబంధనలు అతిక్రమిస్తే సంబంధీకులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం ఆయన జిల్లాలోని ప్రింటర్లతో సమావేశమై ముద్రణ విషయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఎన్నికల కరపత్రాలు, పోస్టర్లు మొదలైన వాటి ముద్రణ, పబ్లికేషన్‌కు సంబంధించి చట్టంలోని నిబంధనలను పాటించడం కంటే వాటి ఉల్లంఘనే ఎక్కువగా అనుసరిస్తున్నట్లు కమిషన్ గుర్తించిందన్నారు. సెక్షన్ 127 ఎ నిబంధనలను, కమిషన్ ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అవసరమైతే ప్రింటింగ్ ప్రెస్ లైసెన్స్‌ను రద్దు చేస్తామన్నారు. ప్రింట్‌లైన్‌లో ఏదైనా ఎన్నికల కరపత్రాలు, పోస్టర్ల ప్రింటర్, ప్రచురణకర్తల పేర్లు, చిరునామాలు, వారు ముద్రించిన ఇతర వస్తువులను స్పష్టంగా సూచించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, ఎన్నికల సెక్షను సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, ప్రింటర్లు పాల్గొన్నారు

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు స్పెక్ట్రా 2కె24

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు స్పెక్ట్రా 2కె24 ఎంతగానో ఉపయోగపడుతుందని వాసవీ ఇంజినీరింగ్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ అన్నారు. పెదతాడేపల్లి గ్రామంలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్పెక్ట్రా 2కె24 గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ సాంకేతిక ఉత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. డిగ్రీ ఎలా పూర్తి చేశామన్నది ప్రదానం కాదని, చదువుకునే సమయంలో ఏమి నేర్చుకున్నాం అన్నదే ప్రధానమని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

లాభాల బాటలో నరసాపురం సొసైటీ



మాట్లాడుతున్న హేమకుమార్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 2023-24 సంవత్సరానికి మరింత లాభాలను ఆర్జించిందని సొసైటీ ఛైర్మన్ హేమకుమార్ తెలిపారు. నరసాపురం కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ (బ్యాంక్)పాలకవర్గ సమావేశం బ్యాంక్ ఛైర్మన్ హేమకుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమకుమార్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరాల్లో సొసైటీ రూ.53 కోట్లు టర్నోవర్ చేసిందన్నారు. ఈ సంవత్సరంలో రూ.22 కోట్లు డిపాజిట్లు రాబట్టిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.11 కోట్లు సొసైటీ లాభం పొందిందన్నారు. సంఘ మెంబర్లకు అత్యధికంగా తొమ్మిది శాతం డివిడెండు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మెంబర్లు మాదాసు గోపాలకృష్ణ, బళ్ల సత్యనారాయణ, కట్టా సత్యనారాయణమూర్తి, కస్తూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగల్తూరులో...

పెనుమంట్రలో...

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎంతోమంది విద్యార్థులను ప్రతిభా పాఠశాల ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిందని ఎంఇఒ యు.శామ్యూల్‌జాన్, వైఎన్ కళాశాల హెచ్ఆర్‌డి చినిమిల్లి శ్రీనివాసులు అన్నారు. మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 36వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎం.సుష్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చిన్నారులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్ది దేశానికి అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆహ్లాదంగా గడిపారు. అనంతరం ఎంఇఒ శామ్యూల్‌జాన్, హెచ్ఆర్‌డి చిన్నమిల్లి శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మేకల పరుశురాం, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగి ఆకన కేశవరావు, సొసైటీ మాజీ డైరెక్టర్ కొత్తపల్లి నాగరాజు, బొల్ల కృష్ణ పాల్గొన్నారు.

పెనుమంట్ర :పిల్లల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ప్రతి పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించాలని పెనుమంట్ర ఎంఇఒ-1 వై.లక్ష్మీనారాయణ అన్నారు. పొలమూరు శివారు నాగళ్లదిబ్బ మండల రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన వార్షికోత్సవ సభకు ఆయన అధ్యక్షత వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెఎన్‌వి.శ్రీనివాస్, మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, మండల శాఖ ప్రతినిధి బి.శ్రీనివాస్, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) అన్నారు. కుముదవల్లి, గొల్లలకోడేరు గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు ఎంఎల్ఎగా పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి తనను గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడే అవకాశాన్ని కల్పించాలని కోరారు. రైతులు, ఆక్వా రైతులు, యువత, మహిళలు, కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు శ్రీనివాసు రాజు, బుద్ధరాజు బలరామరాజు, భూపతిరాజు వెంకట సుబ్బరాజు, భూపతిరాజు రాంబాబు, కటారి సూర్యనా రాయణ రాజు, కాజ వీరాస్వామి, పెనుమత్స శివరామరాజు పాల్గొన్నారు.

ప్రశాంతమైన భీమవరాన్ని సాధించుకుందాం

టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రశాంతమైన వాతావరణంలో ఉన్నా భీమవరాన్ని సాధించుకుందామని, మంచి పరిపాలన రావాలంటే కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యమని రాజ్యసభ మాజీ సభ్యురాలు, టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం ఏడ్వర్డ్ ట్యాంక్ వద్ద జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి పార్టీ శిబిరాన్ని గురువారం టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి, మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. జగన్ పాలనలో అంతా అరచకమే జరిగిందన్నారు. ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు మాట్లాడుతూ ఐకమత్యంతో ఉంటే గెలుపు మనదేనన్నారు. ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా పని చేద్దామన్నారు. కూటమి విజయానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్ఎ అంజిబాబు కుమారుడు పులపర్తి ప్రశాంత్, యిర్రింకి సూర్యారావు, కవురు పృధ్వీశంకర్, రేవు వెంకన్న పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని గ్రామ సచివాలయాల్లో 9059 మంది లబ్ధిదారులు ఉండగా గురువారం 6527 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ ఎంవి.భాస్కరరావు తెలిపారు. పింఛన్ల పంపిణీ 72.05 శాతం పూర్తయిందన్నారు. ఇంకా 27.95 శాతం పింఛన్లు అందించాల్సి ఉందన్నారు. వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు పింఛన్లను ఇంటి వద్దకే అందిస్తామని తెలిపారు.

నరసాపురం : పింఛన్ల పంపిణీలో నరసాపురం అర్బన్ జిల్లాలో మొదటి స్థానంలో ఉంది. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 94.75 శాతం పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణంలో 31 వార్డులకు 15 సచివాలయాలు ఉన్నాయి. మొత్తం పట్టణంలో 5806 మందిలో 5477 మందికి రూ.1,65,47,000 పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని 28 పంచాయతీలకు 11,326 మందిలో 378 మందికి రూ.2,82,54,000 సొమ్మును పంపిణీ చేశారు. మండలంలో 85.47 శాతం పంపిణీ చేసినట్లు నరసాపురం ఎంపిడిఒ ఎంవి.రమణరావు తెలిపారు. మండలంలోని వేములదీవి ఈస్ట్, వెస్ట్, లక్ష్మణేశ్వరం, దర్భరేవు గ్రామాల్లో సచివాలయంలో పింఛన్ పంపిణీలను ఆయన పరిశీలించారు.

పెనుమంట్ర : పెనుమంట్ర పరిధిలోని గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారాగురువారం సాయంత్రం ఏడు గంటల వరకు 80 శాతం పెన్షన్ల పంపిణీ జరిగిందని ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. మండలంలో 8470 మంది లో 6795 మందికి పింఛన్లు అందించామని చెప్పారు.

వీరవాసరం : సచివాలయం సిబ్బంది పింఛనుదారులకు పింఛన్లు అందించారు. ఈ నెల ఆరో తేదీ వరకు పెన్షన్ల బట్వాడా చేసేందుకు గడువు ఉన్నా మండలంలో గురువారం నాటికే 70 శాతం పంపిణీ పూర్తి చేశారు. అభయ హస్తం వినహా మండలంలో మొత్తం వివిధ కేటగిరిల్లో 8418 మంది లబ్ధిదారులు ఒడగా వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా రెండో రోజుకు ఏడు వేలు మందికి పెన్షన్లు అందించారు. సచివాలయాల వద్ద టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేశారు. సచివాలయాల వద్దకు రాలేని వారికి వెల్ఫేర్ అసిస్టెంట్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించారు.

పెనుమంట్ర : పెన్షన్ పంపిణీ సక్రమంగా జరగక మండలంలో గురువారం కూడా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బంది పడ్డారు. మార్టేరు, పొలమూరు, ఆలమూరు, పెనుమంట్ర ఇలా ప్రతి గ్రామ సచివాలయం వద్ద ఉదయం నుంచే పెన్షన్ కోసం పలువురు ఇతరుల సాయంతో వచ్చి, సర్వర్లు మొరాయించడం వల్ల అక్కడే పడిగాపులు పడ్డారు.

గణపవరం : గణపవరం నాలుగు సచివాలయాల్లో గురువారం 92 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ చెప్పారు. ఒకటో సచివాలయంలో 432 మంది పెన్షన్‌దార్లు ఉండగా 386 మందికి అందించామని చెప్పారు. రెండో సచివాలయంలో 546 మందిలో 512 మందికి, మూడో సచివాలయంలో 403 మందిలో 367 మందికి, నాలుగో సచివాలయంలో 1798 మందిలో 1647 మందికి పింఛన్లు అందించామని చెప్పారు. సచివాలయానికి రాలేని వృద్ధులకు, వికలాంగులకు, రోగులకు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లు అందించినట్లు చెప్పారు.

నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహా దళిత నేత బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం మండలంలోని మల్లిపూడి గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలుగుదేశం కార్యాలయం ప్రతినిధి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ హాజరవుతారని చెప్పారు.

మహారాజశ్రీ తణుకు 2వ అదనపు జూనియరు సివిలు జడ్జి వారి కోర్టులో

O.S. No. 114/2021

Between:
Canara (erstwhile Syndicate) Bank, Tanuku, rep. by its Manager. -వాది
AND
Buddiga Sridevi, W/o. Ramachandra Rao, 55 years, Kolla vari Street, Pydiparru, Tanuku Municipality. -ప్రతివాది

వాది పై నెంబరు దావా ప్రతివాదిపై **Rs. 10,08,474-89** పైసలు దర్మిలా వడ్డీ మరియు దావా ఖర్చులు రాబట్టు నిమిత్తము దాఖలు చేసియున్నారు. సదరు దావా ప్రతివాది యొక్క హాజరు నిమిత్తము ది. 03-05-2024న వాయిదా అయి ఉన్నది. ప్రతివాది **ది. 03-05-2024న ఉదయం గం॥ 10.30 ని॥లు** లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరయి, తన యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకోవలసి యున్నది. ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా ప్రతివాది యొక్క పరోక్షమందు తీర్మానింపబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు వాది తరపు న్యాయవాది
ది.03-4-24 తణుకు, సెల్: 9989567750

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru

E.P. No. 322/2011 in O.S. No. 348/2007

Between:
Golla Yalamanda Rao ...DHR/Plaintiff
AND
Sri Lanka Srinivasa Rao and another ...JDR's/ Defendants

పై నంబరు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు కొరకు JDRs/ ప్రతివాదులు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములు గల ఈక్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 19-04-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకోవచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరము: పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు సబ్ రిజిష్ట్రారు యిలాకా, ఏలూరు నగరం T.S. No. 1572, పాత అసెస్‌మెంట్ నెంబరు 3294, దాఖలా చ॥గ॥లు 130, అందులో గల పెంకుటిల్లు నెం. 3బి-3-8 కు హద్దులు.
దక్షిణం: శ్రీ వేంకటేశ్వరస్వామి గుడి తాలూకా ఆస్తి.
తూర్పు: డి.మధుసూదనరావు ఆస్తి.
పడమర: మునిసిపల్ బజారు.
ఉత్తరం: ఆర్.లక్ష్మణరావు ఆస్తి.
ఈ హద్దుల మధ్య సుమారు 130 చ॥గ॥ల ఇంటి స్థలం, అందలి పెంకుటిల్లుతో సహా వేలం వేయుదురు.

DHR విలువ: రూ. 2,00,000/-
అమీనా విలువ: రూ. 7,50,000/-

ఈద్పుగంటి శ్రీనివాసబాబు
ఏలూరు **అట్లూరి రవికుమార్**
ది.02-4-2024 అడ్వకేట్స్, ఏలూరు

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా

ఓ.ఎస్. నెం. 74/2023

బిట్వీన్:
బాల వెంకట సుబ్బారావు -ప్లెయింటిఫ్
మరియు
శ్రీమతి పూరకరణం సీతాదేవి & 6 Others -డిఫెండెంట్స్

టు:
6వ రెస్పాండెంట్: పూరకరణం నిఖిత, తండ్రి: లేటు జగన్ మోహనరావు, స్త్రీ, వయస్సు 26 సం॥లు, అడ్రస్: ప్లాట్ నెం. 303, గణేష్ ఉమశ్రీ అపార్ట్‌మెంట్, 3వ అంతస్తు, దొంగల మండపం దగ్గర, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబర్ గ్రంధములో మీరు 6వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, **ది. 24-04-2024వ తేదీన** పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై నెంబర్ గ్రంధములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.

మాగంటి లక్ష్మణ్‌కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు, సెల్: 9885279889

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా

ఓ.ఎస్. నెం. 74/2023

బిట్వీన్:
బాల వెంకట సుబ్బారావు -ప్లెయింటిఫ్
మరియు
శ్రీమతి పూరకరణం సీతాదేవి & 6 Others -డిఫెండెంట్స్

టు:
1వ రెస్పాండెంట్: శ్రీమతి పూరకరణం సీతాదేవి, భర్త: లేటు రామారావు, స్త్రీ, వయస్సు 82 సం॥లు, అడ్రస్: C/o. మాధవరావు, ఎన్.కాశీశ్వరరావు ఇల్లు, కింది అంతస్తు, తూర్పు ద్వారం, గాంధీ మైదానం దగ్గర, పశ్చిమ వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబర్ గ్రంధములో మీరు 1వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, **ది. 24-04-2024వ తేదీన** పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై నెంబర్ గ్రంధములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.

మాగంటి లక్ష్మణ్‌కుమార్
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు, సెల్: 9885279889